క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఎర్రవల్లిచౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలో కుంకుమార్చన చేశారు.

వాహనాల తనిఖీ

మానవపాడు: మండల కేంద్రంలోని చంద్రశేఖర్‌నగర్, శ్రీనగర కొర్విపాడు స్టేజి, మానవపాడు స్టేజి వద్ద శుక్రవారం ఎస్‌ఐ చంద్రకాంత్ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు.

ఉండవెల్లిలో చిరుజల్లులు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు, కలుగోట్లలో శుక్రవారం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మేఘామృతమై వాతావరణం చల్లాగా మారింది. ఎండవేడిమి నుంచి మండల ప్రజలు కొంత ఉపశమనం పొందారు.

22న అవగాహన సదస్సు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురంలో ఈ నెల 22న ఎస్పీ ఆదేశాల మేరకు ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కళాశాలకు ప్రహరీ నిర్మించండి



మానవపాడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించలేదు. అధికారులకు నివేదికలు అందజేసిన చర్యలు తీసుకోలేదు. కళాశాల తిరిగి ప్రారంభం నాటికి చుట్టూ ప్రహరీ నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కనులపండువగా ప్రభోత్సవం



దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి సప్తాహ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారి ప్రభోత్సవం వైభవంగా జరిగింది. తెల్లవారు జామున 5 గంటలకు ఆలయం నుంచి ప్రారంభం అయిన ప్రభోత్సవం ఉదయం 7 గంటల వరకు కొనసాగింది. పట్టణంలోని ప్రధాన వీధిలో కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది భక్తులు హరహర మహాదేవ అంటూ వేడుకలో పాల్గొన్నారు. అదేవిధంగా వారం రోజులుగా ఆలయంలో అఖండ భజన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

నేడు రథోత్సవం...

సప్తాహ మహోత్సవాలలో భాగంగా చివరి రోజు స్వామి వారి రథోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లను చేశారు. శనివారం తెల్లవారు జామున 5 గంటలకు రథోత్సవం నిర్వహిస్తారు. దేవస్థానం వారు బాణాసంచా కాల్చడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలి వచ్చారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



గండేడ్: శ్రీరామనవమిని పురస్కరించుకొని వెన్నాచేడ్ బండమీద రామస్వామి ఆలయంలో మూడు రోజుల కొనసాగిన జాతర శుక్రవారంతో ముగిసింది. శుక్రవారం తెల్లవారుజామున భక్తులు అగ్నిగుండంలో నడిచారు. శివనామస్మరణతో ప ప్రాంతమంతా మార్మోగింది. ఉదయం ఆలయంలోని మల్లన్నకు నైవేద్యం సమర్పించారు. అనంతరం సీతారామ, లక్ష్మణ ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి గ్రామంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉంచారు. మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, సత్యసాయి సమితి ఆర్గనైజింగ్ సెక్రటరీ శివమల్లప్ప, కన్వీనర్ నారాయణరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చిన్నయ్య, శరణప్ప, నాగేంద్రకుమార్, అంతర్‌గాని రాములు, పులిందర్‌రెడ్డి , పూజారులు జంగం చంద్రశేఖర్, సదాశివ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనాలపై పట్టింపేది?

- పలచబడుతున్న పచ్చదనం
- రక్షణ, నీరు లేక సగానికి పైగా ఎండిన మొక్కలు
- అధికారుల పర్యవేక్షణ కరువు



అమరవాయిలో పల్లెప్రకృతివనం పరిస్థితి



మానవపాడులో బృహత్ పల్లెప్రకృతివనం ఎండిన మొక్కలు

మానవపాడు: తెలంగాణ ఏర్పాటు తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం పేరుతో పెద్ద ఎత్తున్న మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. మూడేళ్ల క్రితం ప్రతి పంచాయతీలో పల్లె ప్రకృతివనం, మండలంలో పెద్ద గ్రామాల్లో మండల బృహత్‌పల్లెప్రకృతి వనం పేరుతో ప్రభుత్వ స్థలాల్లో చుట్టూ రక్షణ చర్యలు చేపట్టి, పంచాయతీ, ఉపాధి హామీ పథకం నిధుల భాగస్వామ్యంతో లక్షలాది మొక్కలు నాటించింది. నాటిన మొక్కలు లెక్కలకే తప్పా వాటి సంరక్షణ చేపట్టలేదు. నాటిన సమయంలో ఉన్న ఉత్సాహం, పర్యవేక్షణ, బాధ్యత లేకపోవడంతో ప్రకృతివనాల్లో నాటిన మొక్కలు వడిలిపోవడం, ఎండిపోవడం, గడ్డి పట్టి కాలగర్భంలో కలిసి పోవడంతో హరిత వనాలన్నీ మొక్కలు లేక పలచబడ్డాయి.

పట్టించుకోని అధికారులు

మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో దాదాపు 15 గ్రామ పంచాయతీల్లో పల్లెప్రకతి వనాలు, మానవపాడు మండల కేంద్రంలో బృహత్ పల్లె ప్రకృతి వనాలలో మొక్కలు నాటారు. అవి కాక ప్రతి ఏటా పంచాయతీల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రధాన రహదారుల్లో రోడ్డు ఇరువైపుల, ఖాళీ ప్రదేశాలలో తదితర ప్రాంతాలలో సైతం మొక్కలు నాటించారు. అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో మాత్రం మచ్చుకు కనపడతాయి. చాలా గ్రామాల్లో మొక్కలు రక్షణ లేక కనపడుతున్నాయి. మండల బృహత్ పల్లెప్రకృతి వనం పేరుతో మండలకేంద్రంలో నిర్మించారు. పంచాయతీ అధికారులు, మండల అధికారులు పట్టించుకోక పోవడంతో హరితహారం మొక్కలను బృహత్ పల్లెప్రకృతి వనంను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారు. నేటికి ఈ వనాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.



పెద్దపోతులపాడు రోడ్డు పక్కన ఎండుతున్న మొక్కలు

వేసవిలో నీటి సమస్య..

ఖరీఫ్ సీజన్ నుంచి సరైన వర్షపాతం లేకపోవడం వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడింది. చాలా గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య ఎదురవుతోంది. ఈ సమయంలో ప్రకృతివనాల్లో మొక్కలను రక్షించడం సాధ్యం కాదని గ్రామస్థాయిలో అధికారులు చెప్పకనే చెబుతున్నారు. చాలా గ్రామాల్లో బోర్లను నిర్మించి నీటి ఆధారంగా మొక్కలు నాటించారు. ఉపాధి హామీ పథకం ద్వారా నర్సరీల్లో మొక్కలు పెంచి కూలీలతోనే మొక్కలను నాటించారు. చాలా గ్రామాల్లో రోడ్ల వెంట నాటిన మొక్కలు సైతం ఎండిపోతున్నాయి. లక్షల మొక్కలు నాటినా వాటి పర్యవేక్షణ, ప్రణాళికలు లేక కాపాడుకోలేకపోతున్నారు.

కొన్ని మొక్కలు ఉన్నా.. నీళ్లు లేవు

మండలంలోని చాలా గ్రామాల్లో పల్లె ప్రకృతివనాల్లో నాటిన మొక్కలు పెద్దగా, ఏపుగా పెరిగాయి. అయితే పల్లెప్రకృతివనంలో మొక్కలకు నీరు అందించలేక ఎండిపోతున్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేక పట్టించుకునేవారు లేరు. వేల కు వేలు ఖర్చు చేసి ప్రభుత్వ ధనం వృథా అవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారుల చొరవ చూపితే మిగిలిన మొక్కలను బతికించవచ్చు.

ప్రత్యేక దృష్టి సారిస్తాం..



మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నాటిన మొక్కలను సంరక్షిస్తాం. ఇందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఖరీఫ్‌లో వర్షాల్లేక, వేసవిలో విపరీతమైన ఎండల వేడిమికి మొక్కలు ఎండిపోతున్నాయి. వర్షాలు పడ్డాక ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటాలని, అప్పటి వరకు ఉన్నా మొక్కలను కాపాడాలని కార్యదర్శులకు సూచిస్తాం.

– ఆంజనేయరెడ్డి, ఎంపీడీఓ, మానవపాడు

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



ధర్మవరంలో ప్రచారం చేస్తున్న నాయకులు

అయిజ: మండలంలోని తూంకుంటలో శుక్రవారం బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహులు, ఖాజా, మద్దిలేటి పాల్గొన్నారు.

ఉండవెల్లి: ప్రాగటూరు, శేరుపల్లెలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, హేమంత్ పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని వేముల, వల్లూరు, ధర్మవరంలో బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల అధ్యక్షులతో కలిసి ఆయన ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఎంపీ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వం ఇచ్చిన మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శివరాం, మహీంద్ర, గోవర్ధన్, శ్రీనివాస్ రెడ్డి, హరికృష్ణ, రవి, మహేష్, రాజు, శివ తదితరులు ఉన్నారు.

అప్రమత్తంతో ప్రమాదాల నివారణ



ఆత్మకూర్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వ్యాపార కేంద్రాల వద్ద శుక్రవారం సిబ్బంది ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విన్యాసాలతో వివరించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలు ప్రమాదాల బారిన పడ్డప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం వారోత్సవాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సంజీవరెడ్డి, రాముడు, సందీప్‌రెడ్డి, భానుచందర్‌రెడ్డి, వెంకటనర్సయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టి సారించండి



మొక్కలకు నీటిని అందిస్తున్న ఎంపీడీఓ

అమరచింత: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని నందిమళ్లలో చెట్టు చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలకు నీరు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి కాకుండా మొక్కల ప్రదేశంలో చెత్తచెదారం ఉంటే వాటిని తొలగించాలని సూచించారు. మొక్కలకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందిచాలని ఆదేశించారు. ప్రార్థన మందిరాలు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల ఆవరణంలో నాటిక మొక్కలు ఎండుముఖం పట్టకుండా వాటిని కాపాడాల్సిన అవసరం ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, ఈసీ రఘు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలపై దృష్టిసారించాలి



విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న జిల్లా అధికారి శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. గతంలో నిర్వహించిన పలు ఆటల పోటీలకు సంబంధించి బహుతులను జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడలపై దృష్టి సారిస్తే, సులువుగా ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉందన్నారు. ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరుచుకుంటే పరిపూర్ణమైన జీవితాన్ని పొందేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, పీజీ సత్యభాస్కర్, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కౌసర్‌జహాన్, విజేత వెంకట్‌రెడ్డి, శ్రీపాద గంగాధర్, అమీనా ముంతాజ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించండి



ఆత్మకూర్: మున్సిపాలిటీకి నాలుగు దిక్కుల మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని కోరుతూ చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ నాగరాజుకు సీపీఐ మండల నాయకులు వినతి పత్రం శుక్రవారం అందించారు. కొత్తకోట రోడ్డు వైపు, అమరచింత వైపు, పాత పంచాయతీ, ప్రభుత్వ ఆస్పత్రి, మటన్ మార్కెట్ దారిలో ప్రతి నిత్యం వేలాది సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారని తెలిపారు. ప్రజల, ప్రయాణికుల అవసరాల నిమిత్తం తక్షణమే మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. శ్రీహరి, రాబర్ట్, మోష, సీఎస్ శెట్టి ఉన్నారు.

పశుగ్రాసానికి డిమాండ్

- నెట్టెంపాడు ఎత్తిపోతలతో పెరిగిన సాగు
- జిల్లా నలుమూలల నుంచి వచ్చి గడ్డిని తీసుకెళ్తున్న రైతులు

ధరూరు: ఒకప్పుడు నడిగడ్డ పేరు చెబితే ఎడారి ప్రాంతంగా పేరొందిన గద్వాల నియోజకవర్గంలో నేడు ధరూరు మండలం సాగులో అగ్రగామిగా నిలుస్తోంది. 2006లో మండలంలో నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. 10 ఏళ్లుగా మండలంలో సాగు పెరగడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ పశుగ్రాసం కొనుగోలు చేస్తున్నారు.

జిల్లా నలుమూలల నుంచి..

జిల్లాలో గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి గడ్డిని కొనుగోలు చేస్తున్నారు. నిత్యం వందలాది ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్తున్నారు. యంత్రాలతోనే వ్యవసాయం, ఇతర పనులు చేస్తున్నప్పటికీ పశుసంపద, వ్యవపసాయంపై ఆశలు చావని రైతులు నేటికీ పశుసంపదను కాపాడుకుంటూ వస్తున్నారు. గద్వాల మండలంతో పాటు మల్దకల్, అయిజ పాంతాల నుంచి ఎక్కువగా రైతులు నెట్టెంపాడు, జూరాల ప్రాజెక్టుల కింద సాగైన పంట ద్వారా వచ్చిన వరి గడ్డిని తీసుకు వెళ్తున్నారు.



ధరూరు నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న వరి గడ్డి

ఖర్చులు అధికం..

గ్రాసం కొనుగోలుకు ట్రాక్టర్ గడ్డి రూ.5వేల నుంచి రూ.6వేల వరకు పలుకుతోంది. ట్రాక్టర్‌కు గడ్డి ఎత్తడానికి కూలీలు రూ.5,500, తరలించడానికి ట్రాక్టర్‌కు మరో రూ.5,500 మొత్తం రూ.15వేల నుంచి రూ.18 వేల వరకు ఖర్చవుతోంది. గ్రాసం కంటే కూలీలు, తరలింపు చార్జీలే అధికమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడ్డి తరలింపునకు పంచాయతీకి చెందిన ట్రాక్టర్లను వినియోగిస్తే బాగుంటుందని రైతులు అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు.

మేత కోసం తిప్పలు



మాకు కొంత వ్యసాయ పొలం ఉంది. దీంతో పాటు ఎద్దులు, పశువులు ఉన్నాయి. వాటికి మేత కోసం చాలా ఇబ్బందులు పడుతున్నాం. కాల్వ, బోర్ల కింద సాగైన రైతుల ద్వారా వరి గడ్డిని తీసుకు వెళ్లి పశువుల మేతను అందిస్తున్నాం. ఇంటి వద్ద పశువులను ఉపవాసం ఉంచలేక అప్పులు చేసి మరీ గ్రాసాన్ని తీసుకెళ్తున్నాం.

– సవారన్న, రైతు, ర్యాలంపాడు

ప్రజలకు అండగా ఉంటాం



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: పేద ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం అందజేశారు. అయిజ మండలం పులికల్ చెందిన మహబూబ్ వైద్య నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వైద్య ఖర్చుల కోసం రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరైనట్లు పేర్కొన్నారు. నాగేశ్వర్ రెడ్డి, గోపాల్ తదితరులు ఉన్నారు.

'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోండి



కేశవరంలో మినీ వాటర్‌ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ నర్సింగరావు

అయిజ: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ నర్సింగరావు అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నతాండ్రపాడు, వేణిసోంపురంను డీఆర్‌డీఓ సందర్శించారు. వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం శివార్లలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను పర్యవేక్షించారు. 100 రోజుల పనిదినాలను మే నెల వరకు పూర్తి చేసుకోవాలని, కూలి రేటు రూ.300 వచ్చేటట్లు కొలతల ప్రకారం పనిచేయాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో డీపీఓ వెంకటరెడ్డి, ఎంపీడీఓ వెకటయ్య, ఎంపీఓ నరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సంవత్సర కరపత్రం విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

అయిజ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజులు ఉండవని, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, 2 జతల యూనిఫాం ఉచితంగా ఇస్తారని, ప్రతిరోజు మధ్యాహ్నం పోషక విలువలతో కూడిన భోజనం పెడుతారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాల్లో ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని, యునిఫాంకు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌కు డబ్బు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అన్ని విధాల ప్రభుత్వ పాఠశాలలు మేలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫలితాలు జీవిత గమ్యాన్ని నిర్దేశిస్తాయి

అలంపూర్: విద్యార్థులు సాధించే మంచి ఫలితాలు భవిష్యత్‌లో జీవిత గమ్యాలను నిర్దేశిస్తాయని మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ కేఏసీ రవిప్రకాష్, హెచ్‌ఎం నాగలక్ష్మి అన్నారు. పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో లారెల్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా లారెన్స్ డే వేడుకల్లో భాగంగా 2023–24 విద్యాసంవత్సరంలో బెస్ట్ స్టూడెంట్ అవార్డులు, అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డులు, ఫిజిక్స్ టాపర్స్, కెమెస్ట్రీ టాపర్స్, బయో టాపర్స్, మ్యాథ్ టాపర్స్, ఐటీ టాపర్స్, బెస్ట్ ఇంగ్లీష్ రీడర్స్, బెస్ట్ తెలుగు రీడర్స్, బెస్ట్ క్యాలిగ్రఫీ ఇన్ ఇంగ్లీష్, బెస్ట్ క్యాలిగ్రఫీ ఇన్ తెలుగు, బెస్ట్ క్యాలిగ్రఫీ ఇన్ హిందీ పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అదేవిధంగా ఈ విద్యాసంవత్సరం విద్యార్థిని, విద్యార్థులకు నాలుగు హౌస్‌లుగా విభజించి అనేక ఆటల పోటీలు నిర్వహించారు. నైపుణ్యం ప్రదర్శించిన విద్యార్థులకు సీనియర్ ఉపాధ్యాయులు బహుమతులు, మెడల్స్, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.



బహుమతులను అందజేస్తున్న హెచ్‌ఎం నాగలక్ష్మి

చింతలాముని రంగస్వామి రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని ఎల్కూరులో చింతలాముని రంగస్వామి రథోత్సవంను శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ మూర్తులను వేదపండితులు రథంపై ఉంచి ఆలయం నుంచి గ్రామంలోని దశమి కట్ట వరకు ఊరేగించారు. రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. స్వామి వారికి భక్తులు దాసంగాలు పెట్టి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

గుంతలమయంగా ప్రధాన రోడ్లు

రాజోళి: మండలంలోని గ్రామాలకు వెళ్లే రోడ్లతో పాటు మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. రాజోళి–శాంతిగనర్ మధ్యలో బీటీ రోడ్డు పూర్తిగా వేయకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. బీటీ రోడ్డు రాజోళిలో మొదలై సరిహద్దు వరకే వేసి, వడ్డేపల్లి సరిహద్దు నుంచి రోడ్డు వేయకపోవడంతో గుంతల రోడ్డుపైనే ప్రయాణం తప్పడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఈ రోడ్డు వేయలేదని, కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో, కనీసం ద్విచక్రవాహనం కూడా ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంది. కంకరతేలి, మోకాళ్లలోతు గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. వీలైనంత త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా కంకర తేలిన రాజోళి-శాంతిగనర్ రోడ్డు

పశువుల ఆస్పత్రి నిర్మాణం ఎప్పుడో?



రాజోళిలో శిథిలావస్థకు చేరిన పశువుల ఆస్పత్రి

రాజోళి: మండల కేంద్రంలో పశువుల ఆస్పత్రి నిర్మాణం ఎప్పుడు అవుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రం ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా, నేటి వరకు నూతన భవనాలు నిర్మించిన దాఖలాలు లేవు. కనీసం ప్రధాన కార్యాలయాలకు కూడా భవనాలు లేకపోతే మండల కేంద్రంలో ప్రజల అవసరాలు ఎలా తీరుతాయి. ప్రభుత్వ భవనాలు లేకపోతే, కార్యకలాపాలు ఎలా నడుస్తాయని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పాడి రైతులు ఎక్కువగా ఉన్న మండలంలో కనీసం పశువుల ఆస్పత్రి నిర్మించకపోతే రైతుల బాధలు ప్రభుత్వానికి ఎలా తెలుస్తాయని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరి, అందులో విషసర్పాలు సంచరిస్తున్నాయి. దాని నిర్మాణం, మరమ్మతు గూర్చి నేటి వరకు ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొంటున్నారు.